





ఇంటి వద్దకే.. రూ.7000



- జూలై 1న రూ.7 వేల పింఛన్
- ఏప్రిల్, మే, జూన్ నెలలకు కలిపి మొత్తంగా అందజేత
- తొలి రోజే అందించాలన్న లక్ష్యంతో కదులుతున్న ప్రభుత్వ యంత్రాంగం
- ఇంటికే వెళ్లి పింఛన్లు అందించేందుకు అధికారుల ఏర్పాట్లు
- సచివాలయ సిబ్బందితోపాటు, ప్రభుత్వ ఉద్యోగులకూ బాధ్యత
- మూడు జిల్లాల్లో 7.73 లక్షల మందికి రూ.541.43 కోట్ల లబ్ధి



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అన్నమాట ప్రకారం పింఛను మొత్తాన్ని రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచడమే కాకుండా ఆ మొత్తాన్ని ఏప్రిల్ నెల నుంచి లెక్కగట్టి మొత్తం రూ.7 వేలు అవ్వాతాతలు, ఒంటరి, వితంతు మహిళలు, ఇతర వర్గాల వారికి ఇవ్వనున్నారు. ఆ మేరకు అన్ని ఏర్పాట్లు చేసింది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రూ.3 వేల పింఛను తీసుకున్నవారికి కూడా ఆ మూడు నెలలకు అదనంగా రావాల్సిన రూ.3 వేలు కూడా కలిపి మొత్తం ఏడు వేల రూపాయలు లబ్ధిదారులకు అందించనున్నారు.

గుంటూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తాజా గణాంకాల ప్రకారం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని 7లక్షల 73వేల 482 మంది పింఛనుదారులకు పెరిగిన పింఛన్లతో లబ్ధి చేకూరనుంది. గుంటూరు జిల్లాలో 2,59,315 మంది, పల్నాడు జిల్లాలో 2,80,568 మంది, బాపట్ల జిల్లాలో 2,33,599 మంది పింఛనుదారులు వున్నారు. వీరందరికీ పెంచిన పింఛన్లు జూలై ఒకటో తేదీన చేతికి అందనున్నాయి. అందుకోసం ఇప్పటికే బడ్జెట్ కేటాయింపులు జరిగిపోయాయి. జిల్లాలోని లబ్ధిదారుల కోసం రూ.541.43 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. జూలై ఒకటో తేదీనాటికే లబ్ధిదారులు అందరికీ పింఛన్లు పంపిణీ చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోంది. అందుకోసం ఏర్పాట్లు కూడా జరిగిపోయాయి. జిల్లాలోని సచివాలయ సిబ్బంది 13వేల మంది తోపాటు, ఇతర శాఖలకు సంబంధించిన ఉద్యోగులను కూడా పింఛన్ల పంపిణీ కోసం నియమించారు.

20 రెట్లు పెంచిన చంద్రబాబు

2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అయిన వెంటనే రూ.200గా వున్న పింఛనును ఒక్కసారిగా ఐదు రెట్లు పెంచి రూ.1000 చేశారు. ఆ తరువాత మరో మూడేళ్లకు ఆ వెయ్యిని రెట్టింపు చేసి రూ.2 వేలు పింఛను ఇచ్చారు. కాగా 2019 ఎన్నికల సందర్భంగా తాను పింఛను రూ.3 వేలు చేస్తానని హామీ ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్ తాను అధికారం చేపట్టిన వెంటనే మాట తప్పారు. నాలుక మడతేసి తాను దశలవారీగా పెంచుతానని అవ్వాతాతలను వంచించారు. ఏడాదిన్నరకు ఒకసారి రూ.250 చొప్పున పెంచి వారిని వంచించారు. సరిగ్గా ఎన్నికల కు మూడు నెలల ముందు రూ.3 వేలు ఇచ్చి హామీని నిలబెట్టుకున్నట్లు మాజీ ముఖ్యమంత్రి జగన్, వైసీపీ నేతలు ప్రచారం చేసుకున్నారు. ఐతే పింఛనుదారులెవరూ వారి మాటలు నమ్మలేదు. అయితే ప్రస్తుతం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఒక్కసారిగా రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచారు. మొత్తంగా 200గా వున్న పింఛనును పదేళ్లలో 20 రెట్లు పెంచి ఇస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కింది.

11 కేటగిరీల వారికి 7 వేల పింఛను

మొత్తం 11 కేటగిరీలకు చెందిన లబ్ధిదారులకు రూ.7వేలు పింఛను ఇవ్వనున్నారు. వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, కల్లు గీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, హెచ్ఐవీ బాధితులు, ట్రాన్సుజెండర్లు, డప్పు కళాకారులు, ఇతర కళాకారుల కేటగిరీలకు చెందిన లబ్ధిదారులకు ఈనెల రూ.7 వేల పింఛను అందుతుంది. మరుసటి నెల నుంచి రూ.4వేలు చొప్పున పింఛను అందనుంది. దివ్యాంగులు, కుష్టుబాధితులకు ఇక నుంచి రూ.6 వేలు, సాధారణ డయాలసిస్, కిడ్నీ, గుండె, లివర్ మార్పిడి బాధితులకు రూ.10వేలు చొప్పున, పూర్తి వైకల్యం, పక్షవాత బాధితులు, మంచంపట్టినవారికి రూ.15వేలు చొప్పున జూలై నెల నుంచి పింఛను అందించనున్నారు.

- వారి స్థానంలో పర్సన్ ఇన్‌చార్జిల నియామకం
- చైర్మన్ కార్యాలయాల సీజ్.. మార్కెటింగ్ శాఖ స్వాధీనం
- జేసీ/మార్కెటింగ్ జేడీలకు బాధ్యతలు అప్పగించే అవకాశం

మొండికేస్తున్నారని వేటు

ఏఎంసీల చైర్మన్లను తొలగిస్తూ ఆదేశాలు

గుంటూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పోయి టీడీపీ నేతృత్వ పరిపాలన వచ్చింది. అయినప్పటికీ నైతికంగా నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయకుండా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని కొందరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు మొండికేస్తున్నారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన మార్కెటింగ్ శాఖ ఆయా చైర్మన్లను తొలగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వారి కార్యాలయాలను సీజ్ చేయాల్సిందిగా ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరి బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, తాడికొండ ఏఎంసీ చైర్మన్ పూర్ణచంద్రరావు, మాచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి(పెద్దబ్బాయి), చిలకలూరిపేట ఏఎంసీ చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి తమ పదవులను కోల్పోయారు. వారి స్థానంలో పర్సన్ ఇన్‌చార్జిలను నియమించే అధికారాన్ని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు కల్పించారు. ప్రభుత్వ ఉత్తర్వులతో సంబంధిత మార్కెటింగ్ సెక్రెటరీలు చైర్మన్ల కార్యాలయాలను సీజ్ చేసి వారి ఆధీనంలోకి తీసుకున్నారు.

పదవీ కాలం ఉందని మొండి..

ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వ్యవసాయ మార్కెట్ కమిటీలకు తన పార్టీకి చెందిన నాయకులకే నామినేటెడ్ పదవులను ఇస్తుంది. చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులను నామినేట్ చేస్తుంది. వీరంతా సంబంధిత ఎమ్మెల్యేల సిఫార్సులతో పదవులు పొందుతుంటారు. ఎన్నికల్లో ఒకవేళ గత ప్రభుత్వం ఓటమి పాలైతే నైతికంగా మార్కెట్ కమిటీల చైర్మన్లు, సభ్యులు కూడా వెనువెంటనే వైదొలుగుతుంటారు. అయితే ఈ దఫా అందుకు విరుద్ధమైన పరిస్థితులు కొన్ని మార్కెట్ కమిటీల్లో తలెత్తాయి. వైసీపీ ప్రభుత్వంలో నామినేట్ అయిన చైర్మన్లు తమకు ఇంకా పదవీకాలం ఉందంటూ కొంతమంది మొండికేశారు. వారికి ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయాన్ని సెక్రెటరీలు తెలియజేసినా రాజీనామా పత్రాల సమర్పించేందుకు ససేమిరా అన్నారు. కొంత సమయం ఇచ్చి వేచి చూసిన ప్రభుత్వం శుక్రవారం తొలగింపు ఉత్తర్వులు జారీ చేసింది. తాడికొండ ఏఎంసీ చైర్మన్ పదవీకాలం జూలై 11 వరకు ఉన్నది. ఎన్నికలకు ముందు ఆయన టీడీపీలోకి మారడంతో తాను వైదొలిగేది లేదని చెప్పి కొనసాగుతున్నారు. గుంటూరు ఏఎంసీ చైర్మన్ పదవీ కాలం జూలై 18తో ముగుస్తుంది. చిలకలూరిపేట ఏఎంసీ చైర్మన్ పదవీకాలం 2025 మార్చి 13, మాచర్ల ఏఎంసీ చైర్మన్ పదవి జూలై 2తో ముగుస్తాయి. వీరందరిని మార్కెటింగ్ స్పెషల్ చీఫ్ సెక్రెటరి తొలగించారు. గతంలో చిన్న మార్కెట్ కమిటీలకు మార్కెటింగ్ జేడీ, సెలెక్షన్ గ్రేడ్ ఉంటే జేసీలకు పర్సన్ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు కేటాయించేవారు.

- ప్రహసనంగా అసైన్డ్ భూముల చట్ట సవరణ
- పేదలకు ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా
- కొత్త ప్రభుత్వం అసైన్ దోపిడీపై దృష్టి పెట్టేనా...?
- సమగ్ర విచారణ కోసం డిమాండ్



సూర్యలంక సముద్రతీరంలో అసైన్డ్ భూముల్లో రిసార్టులు

అసైన్డ్.. మాయాజాలం

బాపట్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు గూడు కోసం, సాగుకోసం ప్రభుత్వ భూములను అసైన్డ్ చేసి అప్పగించడం అనేది ఏళ్ల తరబడి వస్తూ ఉంది. కానీ ఈ ఐదేళ్లలో వైసీపీ నేతల కన్ను పేదలకు అసైన్డ్ చేసిన ప్రభుత్వ భూములపై పడింది. బాపట్ల, చీరాల పరిసర ప్రాంతాలలో వేల ఎకరాల అసైన్డ్ భూమితో పాటు ప్రభుత్వ భూమి అదే స్థాయిలో ఉండడంతో వైసీపీ నేతలు అధికారాన్ని అడ్డం పెట్టుకుని వాటిలో చాలా వరకు కైంకర్యం చేసేశారు. నేతలతో పాటు వారి అనుచరులు ఇష్టారాజ్యంగా ఆ భూములను నయానో భయానో తమ పరం చేసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన అసైన్డ్ భూముల చట్ట సవరణ సదరు పార్టీ నేతల కోసమే అన్నట్లుగా తయారైందే తప్ప నిరుపేదలకు దక్కిన ప్రయోజనం గుండుసున్నా. అసైన్డ్ భూముల విషయంలో దోపిడీ పర్వాన్ని రక్తి కట్టించడానికి బాపట్లలో అనేక విన్యాసాలను వైసీపీ చేసింది. వైసీపీ నేతల అసైన్డ్ భూముల మాయాజాలనికి ఉన్నతాధికారుల సహకారం కూడా తోడవడంతో వారి పని మరింత తేలికయింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ ఐదేళ్లలో జరిగిన అసైన్డ్ భూబాగోతాలపై సమగ్ర విచారణ జరిపితే ఎన్నో పెద్దతలకాయల దోపిడీ వెలుగులోకి వస్తుందని, అదే సమయంలో ప్రభుత్వానికి పెద్దఎత్తున ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటయ్యే అవకాశం ఉందని జిల్లా ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలకు రాష్ట్రమంత్రి వర్గంలో చోటు కూడా దక్కడంతో వైసీపీ పాలనలో జరిగిన భూ దోపిడీపై వారు దృష్టి పెట్టాలని కోరుతున్నారు. సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్ అన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

● ఐదేళ్లలో వేల ఎకరాలను చెరబట్టిన వైసీపీ నేతలు

అసైన్డ్ భూములను కొనడమే నేరమైతే...

బాపట్లలో జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తిగా అసైన్డ్ భూముల్లోనే జరుగుతోంది. ఆ భూములన్నీ అసైన్డ్ అని ప్రభుత్వ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. కానీ మెడికల్ కళాశాల నిర్మాణం కోసం బాపట్లకు చెందిన ఓ దాత విరాళంగా భూమి ఇచ్చారని, ఏకంగా అతనికి సీఎం చేత సన్మానం గతంలో వైసీపీ నేతలు చేయించారు. ఈ నిర్ణయం బాపట్ల ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఉన్నప్పుడు జరిగింది. అప్పుడు ఉన్న అధికారులు అసైన్డ్ నిబంధనలు తోసిరాజని మరీ వైసీపీ నేతల సేవలో తరించడం వల్లే ఇలా జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మెడికల్ కళాశాలకు వితరణగా కొంత అసైన్డ్ భూమి ఇవ్వడం వెనక వైసీపీ నేతల రియల్ ప్రయోజనాలు దాగి ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపితే మరిన్ని నిజాలు బట్టబయలయ్యే అవకాశం ఉందని బాపట్ల ప్రజానీకం అంటోంది.

చట్ట సవరణ వైసీపీ నేతలకే వరం

వైసీపీ ప్రభుత్వం ఏడాదిన్నరక్రితం తెచ్చిన అసైన్డ్ భూముల చట్ట సవరణ వైసీపీ నేతలకే వరంగా మారింది తప్పితే పేదలకు ఆ చట్టం వల్ల ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా. జిల్లాలో దాదాపు 43,000 ఎకరాల ప్రభుత్వ భూమిని నిరుపేదలకు అసైన్డ్ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వం తెచ్చిన అసైన్డ్ చట్ట సవరణ ద్వారా నిర్దిష్ట కాలపరిమితి నిబంధనలను అనుసరించి దాదాపు 25,000 ఎకరాలపై పేదలకు విక్రయ హక్కులు సక్రమించి ఉండాల్సింది. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందాన జిల్లాలో చట్ట సవరణ ఫలాలు కేవలం 2,750 ఎకరాలకే పరిమితమయ్యాయి. ఇది కూడా వైసీపీ నేతలు క్రమబద్ధీకరణ చేయించుకున్నవే తప్పితే పేదలకు జరిగిన మేలు ఏం లేదనే విమర్శలు అప్పట్లోనే వినిపించాయి.

రీసర్వేలో వెలుగు చూసినా అదే నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో భాగంగా పందిళ్లపల్లి పరిసరాల్లో దాదాపు 450 ఎకరాలు అసైన్డ్ భూమి పరాధీనమైనట్లు గుర్తించారు. ఇవన్నీ కూడా గతంలో పేదలకిచ్చిన భూములే కాగా వీటిని నిన్నమొన్నటి వరకు వైసీపీలో ఉండి ఇటీవలే పార్టీమారిన ఓ కీలక నేత కబంధహస్తాల్లోనే ఈ భూములన్నీ ఉన్నట్లు తెలుస్తోంది. వీటికి సంబంధించి అప్పటి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు నోటీసులు కూడా జారీ చేశారు. కానీ ఇంతవరకు పురోగతి లేదు. బాపట్ల సమీపంలో ఏకంగా ప్రభుత్వ ఉద్యోగులంతా కలిసి అసైన్డ్ భూములను కొనుగోలు చేసి వాటిలో నిర్మాణాలు చేపట్టడం నిబంధనల ఉల్లంఘనలకు పరాకాష్ట. పైగా డబ్బులు ఇచ్చి కొనుక్కుంటే తప్పేమిటనే ఎదురుదాడిని చేయడం గమనార్హం. అసైన్డ్ నిబంధనలకు కంచెలాగా వ్యవహరించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులే ఆ నిబంధనలకు తూట్లు పొడవడం, వారికి రక్షణగా వైసీపీ నేతలు వ్యవహరించడం, ఉన్నతాధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం ఇదీ అసైన్డ్ భూములపై ఐదేళ్లు పాలించిన వైసీపీకి ఉన్న శ్రద్ధకి నిదర్శనం.

సముద్రతీర ప్రాంతమే అడ్డాగా...

సూర్యలంకతో పాటు చీరాల సమీపంలో అసైన్డ్ భూముల్లో రిసార్టులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఇవన్నీ కూడా వైసీపీ చోటామోటా నేతల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. అప్పటికే అక్కడ నివాసం ఉంటున్న పేదలను అధికారం అండతో ఖాళీ చేయించి పెద్దఎత్తున రిసార్టుల వ్యాపారానికి తెరలేపారు. మరికొన్ని భూములు అయితే రికార్డుల్లోనే ప్రభుత్వానికి చెందినివిగా చూపెడుతుంటే ఎంచక్కా అక్కడ వ్యాపారాలు చేస్తూ ఐదేళ్లలో కోట్లు దండుకున్నారు. సూర్యలంక సముద్రతీర ప్రాంతం మొత్తాన్ని వైసీపీ ద్వితీయశ్రేణి నేతాగణం తమ కబంధ హస్తాల్లో ఉంచుకుని, నిబంధనలకు పాతరేస్తూ ఇష్టారాజ్యంగా అసైన్డ్ భూములను చెరబట్టారు.



నామినేటెడ్.. ఆశలు

- కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలపై కసరత్తు
- వైసీపీ ప్రభుత్వంలో ఉన్నవారందరూ రాజీనామాలు

బాపట్ల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే నామినేటెడ్ పదవుల్లో ఉన్న వైసీపీ ద్వితీయ శ్రేణి నేతాగణమంతా రాజీనామా బాట పట్టారు. ప్రస్తుతం వీటి భర్తీ మీద కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆయా కార్పొరేషన్లకు నిధులు సమకూర్చి, వాటిని బలోపేతం చేసే విధంగా కసరత్తు మొదలుపెట్టింది. నామినేటెడ్ పదవుల విషయంలో పార్టీలో ఆది నుంచి జెండా మోసిన వారికే న్యాయం జరుగుతుందనే సంకేతాలను ఇటీవల సీఎం చంద్రబాబు పంపడంతో జిల్లాకు చెందిన నేతలు వాటిపై ఆశలు పెట్టుకున్నారు. మార్కెట్ కమిటీలు చైర్మన్లు మొదలుకుని సహకార సంఘాలలో ఉన్న త్రీమెన్ కమిటీ సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లలో సభ్యులుగా ఉన్నవారు, మత్స్య శాఖ డైరెక్టర్‌తో పాటు దాదాపుగా అందరూ రాజీనామాలు చేశారు. ఎన్నికలకు ఏడాదికి ముందు హడావిడిగా వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(బావుడా) చైర్మన్ పోస్టుపై సైతం పలువురు కూటమి నేతలు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో మొత్తం 8 మార్కెట్ కమిటీలు ఉండగా ఆరింటికి చైర్మన్లు ఉన్నారు. వీరిలో ఒకరి పదవీకాలం రెండు నెలల ముందే ముగిసిపోవడంతో ఖాళీగానే ఉంది. మిగిలిన 5 చోట్ల ఇప్పటికే చైర్మన్లు రాజీనామాలు సమర్పించారు. పీఏసీఎస్‌లలో ఉన్న త్రి సభ్య కమిటీలను ఇప్పటికే రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇక జిల్లా వ్యాప్తంగా బీసీ కార్పొరేషన్‌తో పాటు మత్స్యశాఖ లాంటి కార్పొరేషన్లలోని సభ్యులుగా తప్పుకున్నారు. దీంతో ఆయా పదవులు కూటమి పార్టీ నేతలను వరించనున్నాయి. జిల్లాలో ఖాళీ అయిన నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో నేతలు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఇటీవల వ్యవసాయ శాఖతో జరిపిన సమీక్షలో పాల్గొన్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ త్వరలోనే బాపట్ల మార్కెట్ యార్డు కమిటీకి చైర్మన్‌ను నియమిస్తామనే సంకేతాలు ఇచ్చారు. మిగిలిన చోట్ల ఖాళీ అయిన కమిటీ చైర్మన్‌లతో పాటు కార్పొరేషన్ డైరెక్టర్ల పదవుల విషయంపై మంతనాలు జరుపుతున్నారు. ఈ పదవుల పంపకానికి సంబంధించి జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ నిర్ణయం కూడా కీలకం కానుంది.

క్షేత్రస్థాయిలో కష్టించిన వారికే..

ఆయారం గయారాంలకు కాకుండా పార్టీ కష్టకాలంలో జెండా మోసిన వారికే గుర్తింపు ఇచ్చే విధంగా అన్ని కోణాలలో వివరాలు తెప్పించుకుని కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా ఆశావహుల జాబితా ఇప్పటికే నేతల దగ్గరకు చేరింది. రెండుమూడు దశలలో కసరత్తు అనంతరం నామినేటెడ్ పదవుల కేటాయింపుపై ప్రకటన వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పైగా వైసీపీ ఐదేళ్ల పాలనలో పదవుల కోసమే అన్నట్లుగా నామినేటెడ్ పోస్టులను సృష్టించి వాటికి ఓ దశ, దిశ లేకుండా చేశారన్న అపప్రథను మూటగట్టుకుంది. కునారిల్లిపోయిన కార్పొరేషన్లకు జవసత్వాలు కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పరిమితంగానే నామినేటెడ్ ప్రాతిపదికన భర్తీ చేసినప్పటికీ వాటికి కల్పించే నిధులు, అధికారాల విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి న్యాయం చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోంది.

పర్సన్ ఇన్‌చార్జిల నియామకం..

నామినేటెడ్ పదవుల విషయంలో అడుగులు ఆచితూచి వేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. దానిలో భాగంగానే పర్సన్ ఇన్‌చార్జిల నియామకానికి జిల్లా సహకార అధికారి పంపిన ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలిచ్చింది. వైసీపీ నియమించిన త్రీమెన్ కమిటీలన్నీ రద్దు కావడంతో వాటి నియామకం జరుగుతుందని టీడీపీ శ్రేణులు భావించాయి. కానీ ప్రస్తుతానికి పర్సన్ ఇన్‌చార్జిల నియామకానికే ప్రభుత్వం మొగ్గు చూపింది. జిల్లాలో ఉన్న 112 పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిల నియామకం జరగనుంది. వీటిపై పూర్తి స్థాయిలో కసరత్తు చేసిన అనంతరం పాలక కమిటీలను ఎన్నికల విధానంలోనా లేక నామినేటెడ్ ప్రాతిపదికనా అన్న నిర్ణయం ప్రభుత్వం తీసుకోనుంది.

వైసీపీతో ఐదేళ్లు అంటకాగి...

వైసీపీ నేతలతో ఐదేళ్లు అంటకాగి చివరిలో పార్టీ మారిన నేతలు సైతం నామినేటెడ్ పదవులకోసం ముందు వరుసలో ఉంటూ తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ఇలాంటి కొత్త చుట్టాల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని టీడీపీ శ్రేణులు గుర్తు చేస్తున్నాయి. ఆది నుంచి పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులలో పెద్ద పీట వేయడం జరుగుతుందని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదనే అభిప్రాయాన్ని నేతలు వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో రౌడీ మూకలకు కాలం చెల్లింది

● జగన్ కాపాడకుంటే పిన్నెల్లి పాపాల పుట్ట ఎప్పుడో పగిలేది

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూన్28: పల్నాడులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పెంచి పోషించింది, ఇంతకాలం కాపాడింది మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డియేనని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నార ప్రభుత్వం మారటంతో రాష్ట్రంలో రౌడీమూకలకు కాలం చెల్లిందన్నారు. పట్టణంలోని తన నివాస గృహంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలందరినీ భయం గుప్పెట్లోకి నెట్టి ఆ భయమే పెట్టుబడిగా వేల కోట్లు సంపాదించుకొని ఎంతో మంది టీడీపీ పార్టీ కార్యకర్తల రక్తం కళ్ళచూసిన రాక్షసుడు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అని అన్నారు. మాచర్ల కేంద్రంగా పిన్నెల్లి నిర్మించిన నేర సామ్రాజ్యాన్ని కూకటి వేళ్ళతో పెకలించటానికి సమయం ఆసన్న మైందన్నారు. పిన్నెల్లి అరెస్టు దెబ్బతో పల్నాడు ప్రాంత వైసీపీ నేతలతో పాటు ఇంతకాలం జగన్ అండతో చెలరేగి పోయిన రౌడీలందరికీ వణుకు మొదలైందన్నారు. పరారీలో ఉన్న పిన్నెల్లి సోదరుడు వెంకట రామిరెడ్డి, వారి చేతుల్లో ఆయుధాల్లా పనిచేసిన తురకా కిషోర్ ముఠాను సాధ్య మైనంత త్వరగా పట్టుకోవాలని, పల్నాడులో పూర్తిస్థాయి ప్రశాంత పరిస్థితులు నెలకొల్పటంలో ఇదే కీలకమని ప్రత్తిపాటి సూచించారు. పిన్నెల్లి ఐదు సంవత్సరాలుగా ఎన్నో నేరాలు, ఘోరాలు చేసినా బీసీ నాయకుడు తోట చంద్రయ్య హత్య రోజు నుంచే పిన్నెల్లి రాజకీయ పతనం ప్రారంభ మైందన్నారు. బాధితుల పైనే ఎదురు కేసులు పెట్టించి దోచుకున్న పిన్నెల్లి ముఠా వేళ్ళు కత్తిరింపుతో ప్రశాంత పల్నాడు సాధ్యమని, ఇంత కాలం అతడి దురాగతాలకు అండగా నిలిచిన పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ప్రత్తిపాటి కోరారు.

ప్రజాదర్బార్‌లో సమస్యల వెల్లువ

● రాష్ట్ర నలుమూలల నుంచి వస్తున్న ప్రజలు ● సమస్యల పరిష్కారానికి లోకేశ్ హామీతో ఆనందం





వినతిపత్రాలు స్వీకరిస్తున్న నారా లోకేశ్, ఆక్సిజన్ సిలిండర్‌తో ప్రజాదర్బార్‌కు వచ్చి వినతిపత్రం అందిస్తున్న వ్యక్తి

తాడేపల్లి, జూన్ 28: కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలిచేందుకు వారి సమస్యలు పరిష్కరించేందుకు యువనేత, రాష్ట్రమంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. రాష్ట్ర నలుమూలల నుంచి సైతం అర్జీదారులు ఉండవల్లి కరకట్ట వద్దకు వచ్చి లోకేశ్‌కు కలిసి సమస్యలు వివరిస్తున్నారు. సమయం కేటాయించి వారినుంచి వినతులు స్వీకరించి వాటిని సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపిస్తుండడంతో అర్జీదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాజీ మంత్రి అండగా విశాఖ జిల్లా గాజువాక మండలం దువ్వాడలో నాలుగు కోట్ల విలువైన 84 సెంట్ల భూమిని గత వైసీపీ ప్రభుత్వ అండతో డి.వెంకటరమణ, ఆర్.సత్యనారాయణ కబ్జా చేశారని తమకు న్యాయం చేయాలని గాజువాక మండలం డ్రైవర్ కాలనీకి చెందిన చూచుకొండ శ్రీనివాసరావు జె.తాతారావు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సదరు మాజీ మంత్రి ఓ సీఐ అండతో ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి భూమిని ఆక్రమించారని కబ్జాదారుల చెర నుంచి తన భూమిని విడిపించాలని లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. సమస్యను సావధానంగా విన్న లోకేశ్ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా ఆరేళ్ల నుంచి గుండె, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నానని 24 గంటలూ ఆక్సిజన్ సిలిండర్‌పైనే బతుకుతున్నానని చూచుకొండ శ్రీనివాసరావు కన్నీటి పర్యంతమయ్యారు. సాయమందిస్తానని లోకేశ్ తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన షేక్ సల్మా తాను రాష్ట్రస్థాయి పారా క్రీడల్లో రాణించానని పేదరికంలో ఉన్న తనకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కాగా మంగళగిరి నేషనల్ హైవే అథారిటీ అమరావతి యూనిట్‌ను విజయవాడ ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు యూనిట్‌లో కలిపేందుకు ఉత్తర్వులు జారీ చేశారని దీని వల్ల మంగళగిరిలో పనిచేస్తున్న ఉద్యోగులు రోడ్డున పడుతున్నారని తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిబ్బంది కోరారు. మున్సిపల్ కార్పొరేషన్, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు వ్యాయామ దర్శకులుగా అప్‌గ్రేడ్ చేస్తూ పదోన్నతి కల్పించాలని చిత్తూరుకు చెందిన బి.శారద కోరారు. కాగా ఉదయం నుండే కరకట్టపై ప్రజాదర్బార్‌కు ప్రజలు బారులు తీరి కనిపించారు.

నేడు, రేపు ప్రజాదర్బార్‌కు సెలవు...

శని, ఆదివారాలలో ప్రజా దర్బార్ కార్యక్రమం లేదని తిరిగి కార్యక్రమం జరుగు సమయాన్ని తేదీని ఒక రోజు ముందుగానే ప్రకటిస్తామని ప్రజా దర్బార్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రజలు గమనించాలని కోరారు.

మాజీ మంత్రి రజినీపై స్టోన్ క్రషర్ యజమానుల ఫిర్యాదు

తమ వద్ద తీసుకున్న రూ 2.20 కోట్లు తిరిగి ఇప్పించాలని వేడుకోలు

చిలకలూరిపేట, జూన్ 28 : రాష్ట్రంలో అధికార మార్పిడి జరగటంతో చిలకలూరిపేట నియోజక వర్గంలో మాజీ మంత్రి విడదల రజినీ బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి వారికి జరిగిన అన్యాయాలను వెల్లడిస్తున్నారు. శుక్రవారం యడ్లపాడు మండలం యడ్లపాడులో ఉన్న శ్రీ లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ నిర్వాహకులు ధైర్యంగా బయటకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తొలుత తమ ఫిర్యాదును స్థానిక శాసన సభ్యులైన మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుకు, జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతికి, చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డికి అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు. వైసీపీ హయాంలో తమ వద్ద నుంచి విడదల రజినికి రూ 2 కోట్లు, విజిలెన్స్ ఎస్పీ జాషువాకు రూ 10 లక్షలు, రజినీ మరిది విడదల గోపీకి రూ 10 లక్షలు బలవంత పెడితే ఇచ్చామని పేర్కొన్నారు. ఎస్పీ జాషువా తమ క్రషర్ వద్దకు వచ్చి రజినీ చెప్పినట్లు వినక పోతే రూ 50 కోట్లు ఫైన్ వేసి క్రషర్‌ను సీజ్ చేస్తామని బెదిరించారని వివరించారు.

అనంతరం రజినీ మరిదితో చర్చలు జరిపితే రూ 5 కోట్లు తమకు ఇస్తే ఫైన్ లేకుండా చూస్తామని చెప్పినట్లు వివరించారు. చివరకు ప్రాధేయ పడితే రూ 2.20 కోట్లకు మొత్తం వ్యవహారాన్ని సరి చేశారని పేర్కొన్నారు.

తమను బెదిరించి అక్రమంగా తీసుకున్న రూ 2.20 కోట్లను తిరిగి తమకు ఇప్పించాలని స్టోన్ క్రషర్ మేనేజింగ్ పాట్నర్ నల్లపనేని చలపతిరావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు వారి నుంచి ప్రాణ భయం కూడా ఉన్నదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో రజినీ పీఏ రామకృష్ణ పాత్ర కూడ ఉన్నదని వారు పోలీసులకు తెలిపారు.



గోపీకృష్ణ పాడిమోస్తున్న ఎమ్మెల్యే వేగేశన, తహసీల్దార్ నిర్మలానందబాబా

యాజలికి గోపీకృష్ణ మృతదేహం

● అమెరికాలో దుండగుని చేతిలో మృతి

కర్లపాలెం, జూన్ 28: అమెరికాలో దుండగుని చేతిలో తుపాకీ కాల్పులో మృతి చెందిన యాజలి వాస్తవ్యుడు దాసరి గోపీకృష్ణ మృతదేహం వారం రోజులకు బాపట్లజిల్లా యాజలికి శుక్రవారం వేకువజామున చేరుకుంది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, భార్య, బంధువులు వారం రోజులపాటు మృతదేహం కొరకు నిరీక్షించారు. మృతదేహం ఇంటికి చేరుకునే సరికి తల్లిదండ్రుల రోదనలను ఆపటం ఎవరి తరంలేకుండా పోయింది. బాపట్లశాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ యాజలిలో గోపీకృష్ణ ఇంటికి వచ్చేశారు. తల్లిదండ్రులు ధనలక్ష్మి శ్రీనివాసరావు, భార్య ప్రవల్లికలను ఓదార్చే ప్రయత్నంచేశారు. గోపీకృష్ణ మృతదేహానికి నరేంద్ర వర్మ పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. గోపీకృష్ణ మృతదేహానికి దాహన సంస్కారాలకు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఒకవైపు మరోవైపు కర్లపాలెం తహసీల్దార్ నిర్మలానందబాబాలు గోపీకృష్ణ పాడిమోశారు. మృతుడు దాసరి గోపీకృష్ణ భార్యకు ప్రభుత్వం తరపున ఉద్యోగం ఇప్పిస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రెవెన్యూశాఖా మంత్రి రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు తెలియజేశారు.

అక్కడ మొక్కల్లేవు..

నిర్వహణకు రూ.60 వేలు.!

గుంటూరు(తూర్పు), జూన్ 28: గ్రామంలో మొత్తం 2వేల మొక్కలు నాటాం.. వాటి నిర్వహణకు రూ.20వేలు, కాపలా వారికి రూ.40వేలు మొత్తం నెలకు రూ.60వేలు చెల్లిస్తున్నామనే తప్పుడు బిల్లులు వెలుగులోకి వచ్చాయి. అసలు మొక్కలు లేకుండా వాటి నిర్వహణకు అంత ఖర్చు ఎలా పెట్టారని గ్రామస్తులు నివ్వెరపోయ్యారు. శుక్రవారం గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామసభలో అవకతవకలు బయటపడ్డాయి. దీనిపై టీడీపీ, జనసేన నాయకులు నిలదీస్తే అసలు వాస్తవాలు బయటకు వచ్చాయి. 2022లో ఉపాధి హామీ పథకంలో గ్రామానికి 2000 మొక్కలు వచ్చాయని, ప్రతి మొక్కకు రూ.30 ఖర్చు పెట్టామని మొత్తం నెలకు రూ.60 వేలు ఖర్చు అవుతుందని చెప్పి వైసీపీ నాయకులు తప్పుడు బిల్లులు సృష్టించారు. అప్పటి నుంచి 24 నెలలు పాటు ఈ తతంగం సాగింది. మొత్తం రూ.14 లక్షల 40వేల బిల్లులను డ్రా చేసినట్టు గుర్తించారు. గ్రామంలోని నాలుగురి ఖాతాల్లోకి జమ అయినట్టు గుర్తించారు. దీనిపై గ్రామ సభల్లో సిబ్బందిని అడగ్గా పొంతనలేని సమాధానం చెప్పారు. దీంతో తప్పుడు బిల్లులపై జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి, విచారణ కోరతామని టీడీపీ, జనసేన నాయకులు స్పష్టం చేశారు.

నదులు అనుసంధానంతో

నీటి కొరత ఉండదు

● తెలంగాణ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్



తెలంగాణ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న కలెక్టర్

గుంటూరు సిటీ, జూన్ 28: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి పట్ల చంద్రబాబు ఎంతో ఉత్సాహంగా వున్నారని తెలంగాణ, జార్ఖండ్ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ సిపి రాధాకృష్ణన్ అన్నారు. తన చిరకాల మిత్రుడు అయిన చంద్రబాబు నాయుడుని కలిసి అభినందనలు తెలిపానని వెల్లడించారు. శుక్రవారం గుంటూరు పట్టణం కృష్ణనగర్ శ్రీ లక్ష్మీ నారాయణ దేవస్థానానికి దర్శనార్థం విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పై చంద్రబాబుతో మాట్లాడటం జరిగిందన్నారు. దక్షిణ భారతంలో ఉన్న నదుల అనుసంధానం వల్ల వర్షపు జలాలు నిరుపయోగంగా సముద్రంలో కలవకుండా వుంటాయని అందువల్ల నీటి కొరత ఉన్న ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ తుషార్ దూడి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గళ్లా మాధవి గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో గవర్నర్ ఘనస్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమం అనంతరం గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్ , గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నులకపేట - బ్రహ్మనాథపురం రైల్వేగేటు తాత్కాలిక మూసివేత

గుంటూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఓవర్ హాలింగ్, రోడ్డు మరమ్మతులు నిమిత్తం నులకపేట - బ్రహ్మనాథపురం మధ్యన ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్ గేటుని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ ఆదివారం రాత్రి 7 గంటల వరకు గేటు మూసి ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గమనించి పాదచారులు, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని సూచించారు.

దాడి సంఘటనలో 13 మంది వైసీపీ వర్గీయుల అరెస్టు

వట్టిచెరుకూరు: మండలంంలోని గారపాడు ఎస్సీ కాలనీలో ఈ నెల 25వ తేది రాత్రి టిడిపి నాయకులు, సానుభూతిపరులు 7గురిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచిన కేసులో శుక్రవారం వైసీపీకి చెందిన కారసాల బుల్లెయ్యతో పాటు 13 ముందిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. సీఐ ఉదయ్‌బాబు, ఎస్ఐ వినోద్‌బాబు, సిబ్బంది గురువారం ఎస్సీ కాలనీలో పర్యటించారు.

జీజీహెచ్ ప్రక్షాళనకు పెమ్మసాని అడుగులు

● నేడు కలెక్టర్, సూపరింటెండెంట్‌లో కలిసి ఆస్పత్రి సందర్శన

గుంటూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్)ని సమూలంగా ప్రక్షాళన చేసేందుకు కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నడుం బిగించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జీజీహెచ్‌ని ఎంతైతే భ్రష్టు పట్టించాలో అంతగా పట్టించిన దృష్ట్యా అన్నింటిని గాడిన పెట్టాలని మంత్రి నిర్ణయించారు. అందులో భాగంగా శనివారం ఆయన జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్యులతో కలిసి ఆస్పత్రిలో ప్రతీ విభాగాన్ని సందర్శించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రోగులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకోనున్నారు. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఒక పూటంతా జీజీహెచ్ సందర్శన, సమీక్షకే సమయాన్ని కేటాయించారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి జీజీహెచ్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకొన్నారు. అలానే సమగ్ర నివేదికని కూడా సిద్ధం చేయించారు. ఆ నివేదికని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసానికి నివేదించనున్నారు. ఎన్ఆర్ఐల సహకారంతో పాటు కేంద్రం నుంచి నిధులు విడుదల చేయించాలని కోరనున్నట్లు సమాచారం.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

అత్యాచారం కేసులో నిందితుల అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా ఎస్పీ మాలికా గార్గ్

నరసరావుపేట లీగల్, జూన్ 28: ఒంటరి మహిళపై అత్యాచార, హత్య, దొంగతనం కేసును జిల్లా పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్టు చేశారు. పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పల్నాడు ఎస్పీ మాలికా గార్గ్ వివరాలు వెల్లడించారు. మృతురాలు ఇంట్లోనే కిరాణా షాపు పెట్టుకొని అప్పుడప్పుడు అక్రమంగా మద్యం విక్రయిస్తూ ఉండేది. భర్తతో గొడవలు పడి ఒంటరిగా జీవిస్తోంది. ఆమె తన ఇంటి పోర్షన్‌ను బాబునాయక్‌కు అద్దెకు ఇచ్చింది. ఈనెల 26న రాత్రి 9 గంటల సమయంలో బాబు నాయక్, అతని బంధువైన బాలు నాయక్‌తో కలసి మద్యం సేవించటానికి మృతురాలి వద్దకు వెళ్లారు ఆ సమయంలో ఆమె డబ్బులు లేనిదే మద్యం ఇవ్వలేననటంతో వారి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహించిన ఇద్దరు నిందితులు ఆమె తలపై పప్పుగుత్తితో కొట్టి వెనుక గదిలోకి తీసుకు వెళ్లారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె చెవులకు ఉన్న కమ్మలను, షాపులో ఉన్న కొంత డబ్బును తీసుకెళ్లారు. నిందితులను శుక్రవారం కారంపూడిలోని వినుకొండ రోడ్డులోని ఎన్ఎస్‌పీ కాలువ వద్ద అరెస్టు చేసినట్టు తెలిపారు. పోలీసుల బృందంలోని సిబ్బందికి ఎస్పీ మల్లికా గార్గ్ ప్రత్యేక ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట లీగల్, జూన్ 28: నరసరావుపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయస్థాన భవన సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.సత్యశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్, చెక్‌బౌన్స్, మోటారు వాహన ప్రమాద, రెవెన్యూ, బ్యాంక్, కుటుంబ సంబంధ కేసులు, ముందస్తు వ్యాజ్యాలు, రాజీ మార్గం ద్వారా పరిష్కరించు కోవచ్చన్నారు. కక్షి దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచు కోవాలని ఆమె కోరారు.

విజ్ఞాన్స్ వర్సిటీ వీసీకి గౌరవ కల్నల్ ర్యాంక్



ఆచార్య పీ నాగభూషణ్

గుంటూరు(విద్య), జూన్ 28: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్‌కు ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్‌ను అందిస్తున్నట్లు న్యూఢిల్లీలోని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ శుక్రవారం ప్రకటించింది. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను, గెజిట్ నోటిఫికేషన్‌ను త్వరలోనే ఆయ నకు అందజేస్తామని వెల్లడించింది. విజ్ఞాన్స్ యూని వర్సిటీ అకడమిక్ ఫ్రేమ్‌వర్క్‌లో ఎన్‌సీసీను ఏకీకృతం చేయడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచి విద్యార్థుల్లో క్రమశిక్షణ, స్నేహభావం, నిబద్ధత, సమగ్ర అభివృద్ధికిఇ చేస్తున్నటువంటి కృషికి గాను ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్‌ను అందిస్తున్నామని వెల్లడించింది. నాగభూషణ్‌కు విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్తిపాడు సీఐ, ఎస్ఐలపై సస్పెన్షన్ వేటు

● మండలంలో శాంతి భద్రత వైఫల్యమే కారణం

ప్రత్తిపాడు, జూన్ 28: ప్రత్తిపాడు సీఐ నిస్సార్ భాషా, ఎస్ఐ సోమేశ్వరరావులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఐజీ త్రిపాటి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల తరువాత మండలంలో జరిగిన శాంతి భద్రతల వైఫల్యమే కారణంగా కనిపిస్తోంది. నాలుగు రోజుల క్రితం గొట్టిపాడు ఎస్సీ కాలనీలో ఫ్లెక్సీ వివాదం జరిగింది. ఈ క్రమంలో వైసీపీ నాయకులు కమ్యూనిటీ హాల్ స్టేజ్‌పై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తీయించే విషయంలో రాత్రి మొత్తం వివాదం జరిగింది. తెల్లవార్లు గ్రామస్తులు రోడ్డుపై ఉండి తెల్లారిన తరువాత పంచాయతీ అధికారులు వచ్చి ఫ్లెక్సీని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతే కాకుండా ప్రత్తిపాడులో కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఆక్రమణలో ఉన్న గృహాలను తొలగించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు కమ్మా శివప్రసాద్‌పై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి వేటకొడవళ్లతో విచక్షణా రహితంగా నరకడం వంటివి జరిగాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్తిపాడు మండలంలో ఇలాంటి సంఘటనలు జరిగిన నేపథ్యంలో ప్రత్తిపాడు సీఐ నిస్సార్ భాషా, ఎస్ఐ సోమేశ్వరరావులను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేశారు.

క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలి

● తెలుగునాడు యూనియన్ నేతల విజ్ఞప్తి



మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నేతలు

గుంటూరు సిటీ, జూన్ 28: వైద్య, ఆరోగ్య శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం) వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు ఆశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసచార్యులు సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపకేంద్రాల్లో పనిచేస్తున్న రెగ్యులర్ మహిళా ఆరోగ్య కార్యకర్తలను రీడిప్లాయ్మెంట్ పేరుతో సుదూర ప్రాంతాలకు బదిలీ చేసి జగన్ ప్రభుత్వం నానా ఇబ్బందులకు గురిచేసిందని మంత్రికి వివరించారు. ఏడుకన్నా ఎక్కువ సచివాలయాలు ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇద్దరు మగ ఆరోగ్య పర్యవేక్షకులు ఉండేలా చూడాలని కోరారు. అనవసర యాప్‌లతో ఏఎన్ఎంలపై మోపిన పనిభారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను మానవతా దృక్పథంతో వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు.

ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న క్రైమ్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, జూన్ 28: తాళాలు వేసి వున్న గృహాలే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా క్రైమ్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా గోరంట్లకు చెందిన చిల్లర సురేష్, పెదనందిపాడుకు చెందిన కిరణ్ ముఠాగా ఏర్పడి రాష్ట్రంలోని పలుచోట్ల చోరీలకు పాల్పడ్డారని చెప్పారు. సీసీఎస్, మంగళగిరి రూరల్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చేపట్టారని తెలిపారు.. ఈ నేపథ్యంలో నిందితులిద్దరూ మంగళగిరి ఎన్నారై ఆసుపత్రి సమీపంలో వున్నట్లు పక్కా సమాచారం రావడంతో వారిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి సుమారు 29 గ్రాముల బంగారం, 40 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరిలో సురేష్‌పై 50కి పైగా కేసులు, కిరణ్‌పై 30కి పైగా కేసులు వున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో సీసీఎస్ డీఎస్పీ శివాజీరాజ్, మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ వినోద్‌కుమార్, రూరల్ ఎస్ఐ క్రాంతికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పిన్నెల్లి అరెస్టుతో పల్నాడుకు ప్రశాంతత

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్ 28: పల్నాడు జిల్లా ప్రశాంత కోసం, ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌లో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరెస్టు తొలి అడుగు మాత్రమేనని వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చని పల్లెల్లో ఫ్యాక్షన్ నేరగాళ్లను ఎగదోసిన పిన్నెల్లి మిగిలిన పరివారం సహా ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తి ఉండదని స్పష్టం చేశారు. అరాచక వైసీపీ సర్కారు పోవడంతో శాంతి భద్రతలకు మంచి రోజులు వచ్చాయని, పోలీసులు తమ పని తాము చేసుకోవచ్చని పిన్నెల్లి అరెస్టుతో స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లు అయిందన్నారు. అయిదేళ్లుగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నో నేరాలలకు పాల్పడ్డారని, వాటన్నిటికీ శిక్షలు పడితే జీవితాంతం అతడు జైలు నుంచి బయటకు వచ్చే అవకాశం లేదన్నారు. ఇవే నేరాల్లో పిన్నెల్లి సోదరుడు వెంకట్రామిరెడ్డి కూడా కటకటాల ఊచలు లెక్కించడం ఖాయమన్నారు. ఒక్క మాచర్ల నియోజకవర్గంలో గడిచిన అయిదేళ్లలో రూ.2వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు.



చిన్నారులకు యూనిఫారమ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఎంఈవో విజయశ్రీ

విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

కర్లపాలెం, జూన్ 28 : విద్యార్థులు మంచిగా చదువుకొని సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగాలని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. కర్లపాలెం పంచాయతీ రాజుపాలెంలోని ఉర్దూ పాఠశాలలో చిన్నారులకు శుక్రవారం నోట్‌పుస్తకాలు, దుస్తులు, బూట్లను నరేంద్రవర్మ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విజయశ్రీ, పఠాన్ అహ్మద్‌బాషా, షేక్ బాజి, హైదరాబాద్ వలి తదితరులు పాల్గొనగా నరేంద్రవర్మ కర్లపాలెంలో ఏర్పాటు చేసిన యాక్షన్ టవర్స్‌ను తన అనుయాయులతో కలిసి ప్రారంభించారు. హైదరాబాద్ వలి బ్రదర్స్, పఠాన్, షేక్ బాజి, ఇమామ్, మెకానిక్‌బాబు, టీడీపీ నాయకులు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్స్ ఆధ్వర్యంలో నరేంద్రవర్మకు సన్మానం

బాపట్ల, జూన్ 28 : కమ్మజనసేవాసమితి కల్యాణ మండపంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైస్‌మిల్లర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నరేంద్రవర్మను ఘనంగా సత్కరించి సన్మానించి మెమోంటో అందజేశారు. ఈసందర్భంగా రైస్‌మిల్లర్స్ సమస్యలు గురించి ఆయనకు వివరించారు. అనంతరం నరేంద్రవర్మ మాట్లాడుతూ సన్మానాలు తనకు ఇష్టంలేదని పట్టణాభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని కోరారు. బాపట్ల మున్సిపాలిటీ అప్పులలో ఉంది కావున విరాళాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గతంలో కోన రఘుపతికి సన్మానాలు చేసి ఆయనను పంపించారని, నాకు సేవచేయటానికి అవకాశం ఇచ్చారు కావున నిజాయితీగా పని చేస్తానని నరేంద్రవర్మ తెలిపారు. ఏదైన తప్పు చేస్తే ప్రశ్నించాలన్నారు. రేషన్ బియ్యం ఎక్కువగా రేపల్లె, పొన్నూరు, చీరాల, బాపట్లలో దారి మళ్లుతున్నట్లు ప్రచారం ఉందన్నారు. పీడియాక్ట్ పెట్టటానికి వెనుకాడనని హెచ్చరించారు. బాపట్ల అభివృద్ధికి కంకణం కట్టుకున్నానని నరేంద్రవర్మ తెలిపారు. కార్యక్రమంలో నల్లమల్లి శ్రీనివాసరావు, యార్లగడ్డ లక్ష్మీ నారాయణ, నామన వెంకటశివన్నారాయణ, గొలపల శ్రీనివాసరావు, మామిడి రమేష్, ముక్కామల సాంబశివరావు, కావూరి శ్రీనివాసరెడ్డి, బూర్లె రామసుబ్బారావు, నరాలశెట్టి ప్రకాశరావు, ఎస్‌వీఆర్ కుమార్, రైస్‌మిల్లర్‌లు పాల్గొన్నారు.

కళావేదిక నిర్మించి ప్రారంభించిన సినీనిర్మాత పువ్వాడ



సినీనిర్మాత పువ్వాడ ఏకాంబరేశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు

బాపట్ల,జూన్ 28 : పుట్టి పెరిగిన గ్రామానికి ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో చెరువుజమ్ములపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ సినీనిర్మాత పువ్వాడ ఏకాంబరేశ్వరరావు కళావేదికను నిర్మించి శుక్రవారం ప్రారంభించి విద్యార్థులకు అంకితం చేశారు. గ్రామపెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు ఈ సందర్భంగా ఏకాంబరేశ్వరరావును అభినందించారు. ఆయనతోపాటు ఆయన భార్య అమరేశ్వరిలను ఘనంగా సత్కరించి సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలికవసతుల రూపకల్పనకు దాతలు ముందుకురావటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఇనగంటి హేమలత రాణి, అంకినీడు ప్రసాద్, టీడీపీ నాయకులు పంగులూరి శ్రీనివాసరావు, చెన్నుపాటి కిషోర్‌బాబు, యార్లగడ్డ హరిబాబు, రామినేని శ్రీనివాసరావు, పువ్వాడ దుర్గాప్రసాద్, పువ్వాడ బసంత్‌కుమార్, కొమ్మినేని శ్రీనివాసరావు, వంకాయలపాటి హరిబాబు, ప్రధానోపాధ్యాయులు పివి. కృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుబజార్‌కు మోక్షం


● వైసీపీ పాలనలో శిథిలావస్థకు చేరిన వైనం

● ప్రారంభించేందుకు సిద్ధం చేయాలన్న వేగేశన

బాపట్ల, జూన్ 28 : వైసీపీ పాలనలో మూలనపడి శిథిలావస్థకు చేరిన బాపట్ల రైతు బజారును ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారులను ఆదేశించారు. రైతు ప్రయోజనాల దృష్ట్యా దీనిని రైతులకు అంకితం చేయాలని ఆయన భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డు నిధులు రూ.60 లక్షలు వెచ్చించి సన్న, చిన్నకారు రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన రైతుబజారు శిథిలావస్థకు చేరింది. కేవలం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన కారణంగానే దీనిని నిర్లక్ష్యం చేశారు. 2019 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ రైతుప్రయోజనాల దృష్ట్యా దీని నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టి రైతులకు అంకితం చేశారు. కొద్దిపాటి భూములలో కూరగాయలు, ఆకుకూరలు పండించుకునే రైతులు రైతు కార్డు తీసుకొని ఈ రైతుబజారులో ఏవిధమైన అద్దె లేకుండా తమ ఉత్పత్తులను విక్రయించుకునే ఏర్పాటు చేశారు. దీని కోసం 56షాపులు నిర్మించారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నాయకులు దీనిని నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా మద్యంబాబులకు అడ్డాగా మారింది. దీనికితోడు కూరగాయల మార్కెట్‌లోని బడా వ్యాపారులు రైతుబజారు ప్రారంభమైతే తమకు వ్యాపారం తగ్గుతుందనే భయంతో దానిని ప్రారంభించకుండా అడ్డుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆంధ్రజ్యోతి ద్వారా సమస్య తెలుసుకున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ దీనిపై దృష్టిసారించారు. ప్రారంభించటానికి సిద్ధం చేస్తున్నారు.



కూరగాయల మార్కెట్ సమీపంలోని రైతుబజారు



ఈవీఎం గోదాం భద్రతను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్ తదితరులు


ఈవీఎం గోదాం భద్రతను పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్

బాపట్ల, జూన్ 28 : పట్టణంలోని వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో ఈవీఎం గోదాం భద్రతను ఇన్‌చార్జి కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. భారత ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు త్రైమాసిక సాధారణ పరిశీలనలో భాగంగా గోదాం పరిశీలించారు. ఈవీఎం యంత్రాలను భద్రపరిచిన గోదాం, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. గోదాంకు వేసిన తాళాలు, సీల్‌ను, సంబంధిత దస్త్రాలను తనిఖీ చేశారు. ఈవీఎం గోదాంకు నిరంతర భద్రత ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, గోదాం ఇన్‌చార్జి ఎంవి సుధాకర్ బాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య పాల్గొన్నారు.

2,700 కౌలు రైతు కార్డులు అందజేత

కర్లపాలెం, జూన్ 28 : కర్లపాలెం మండలంలో 2,700 కౌలు రైతులకు కౌలు రైతుకార్డులు అందజేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ అన్నారు. కర్లపాలెం మండలంలోని బుద్దాం గ్రామంలో తహసీల్దార్ నిర్మలానందబాబాతో కలిసి కౌలు రైతులకు కార్డులు పంపిణీ చేశారు. ఏట్రవారిపాలెం గ్రామంలో బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్ కౌలు రైతులకు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మీ, చీరాల శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ సహాయకులు పూజ, వీఆర్వో సాంబయ్య, కార్యదర్శి పద్మావతి పాల్గొన్నారు.

ఎస్‌బీ సీఐ మల్లికార్జునరావును అభినందించిన ఎస్పీ వకుల్ జిందాల్



ఎస్‌బీ సీఐ మల్లికార్జునరావుకు ప్రశంసపత్రం అందజేసి అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, జూన్ 28 : బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌బీ సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న వి.మల్లికార్జునరావును శుక్రవారం ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. గతంలో తాడేపల్లి సీఐగా పని చేస్తున్న సమయంలో ఓ యువతిని మాయమాటల తో లొంగ తీసుకొని అత్యాచారంచేసిన కేసులో నింది తుడు తాతాపూడి అనీల్‌కుమార్‌కు శిక్ష పడేవిధంగా కేసు దర్యాప్తు చేసిన సీఐని అభినందించారు. నేరం నిరూపించటంతో నిందితుడికి 10 ఏళ్ళు జైలు శిక్ష, రూ.53 వేల జరిమాన విధిస్తూ గుంటూరు 5వ అదనపు జిల్లా కోర్టు జడ్జి నీలిమా తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా సీఐ మల్లికార్జునరావుకు ప్రశంసపత్రం అందజేసి ఎస్పీ అభినందించారు.

మౌలిక లక్ష్యాల ప్రచార చైతన్య కార్యక్రమం ప్రారంభం

బాపట్ల, జూన్ 28 : ఊరూరా జనవిజ్ఞానం ఆధ్వర్యంలో రాజ్యాంగ పీఠికలోని మౌలిక లక్ష్యాల ప్రచార చైతన్య కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. బాపట్ల సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి రాష్ట్రాధ్యక్షులు కోట వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికలలో భారతదేశ వ్యాప్తంగా ప్రజలు అద్భుతమైన తీర్పుతో కేంద్ర, రాష్ట్రాలలో గొప్పమార్పులు తీసుకురావటం వల్ల భారతరాజ్యాంగ వ్యవస్థల ప్రాముఖ్యత పెరిగిందన్నారు. కార్యక్రమానికి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జివి.బ్రహ్మం అధ్యక్షత వహించగా ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వైవి.నరసింహారావు, కె.శ్రీహరి, రావూరి నరసింహవర్మ, జీవి. సుబ్రహ్మణ్యం, దగ్గుమళ్ళ సుభాషణరావు, బండికళ్ళ బాబురావు, సూర్యనారాయణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

బాపట్ల, జూన్ 28 : బాపట్ల కోర్టుల సముదాయంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 6వ అదనపు జిల్లా జడ్జి కెపి బాలాజి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లోక్‌అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్, సివిల్, చెక్‌బౌన్స్ కేసులు, రెవెన్యూ కేసులు, మోటారు వాహనాల ప్రమాద బీమా కేసులు, బ్యాంక్ కేసులు, కుటుంబ తగాదాలు, ప్రిలిటిగేషన్ కేసులను పరిష్కరించటం జరుగుతుందన్నారు. కక్షిదారులు తమ కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

ఆదాయ పన్నుశాఖాధికారికి సన్మానం

బాపట్ల, జూన్ 28 : జిల్లా అదాయపు పన్నుశాఖాధికారి ఎం.సాంబశివరావు ఉద్యోగవిరమణ సందర్భంగా శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డి.వెంకటేశ్వర్లు, పరిశుద్ధరావు, శోభన్, ఎం.శేఖర్ తదితరులు పాల్గొని సాంబశివరావు దంపతులను ఘనంగా సత్కరించి సన్మానించారు.

భక్తులు సమర్పించిన చీరల వేలం రేపు


పిట్టలవానిపాలెం, జూన్ 28 : మండల పరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 30న ఉదయం 10 గంటలకు అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు బహిరంగ వేలం పాట జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆసక్తి కలిగిన భక్తులు ఈ వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

బడిబయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

పిట్టలవానిపాలెం, జూన్ 28 : మండల కేంద్రమైన పిట్టలవానిపాలెం విద్యాశాఖా కార్యాలయాన్ని శుక్రవారం బాపట్ల జిల్లా సమగ్రశిక్ష ఎఎల్‌ఎస్‌సి కెవి సత్యసాగర్ సందర్శించారు. ఈసందర్భంగా మండల విద్యాశాఖాధికారి-2 ఎస్.రాజారత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమగ్రశిక్ష ఎఎల్‌ఎస్‌సి సత్యసాగర్ పాల్గొని కార్యాలయంలోని సీఆర్పీలు, ఐఈఆర్పీలు, పిటిఐలను ఉద్దేశించి మాట్లాడుతూ 5 సంవత్సరాలకు చెందిన పిల్లలను, బడిబయట పిల్లలను బడిలో చేర్పించే విధంగా కృషి చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

191 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

రేపల్లె, జూన్ 28 : ఐటీఐ చదివిన విద్యార్థులు 191 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా ఉపాధి కన్వీనర్ ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్‌బాబు తెలిపారు. శుక్రవారం గూడవల్లి ఐటీఐ కళాశాలలో వివిధ రకాల కంపెనీలు ఐటీఐ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్, అమర్‌రాజా బ్యాటరీస్, డిక్సన్, బోండాడా, జోషిన్, ఐటీసీ, శ్రీచక్ర పాలీ ప్లాస్ట్ తదితర కంపెనీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించటం జరిగిందని, బాపట్ల జిల్లా పరిధిలోని ఐటీఐ కళాశాలలోని 240 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలో పాల్గొనగా 191 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి హారిక, ఆర్.శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కన్వీనర్ ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు

రాజకీయ కారణాలతో దాడులు.. ప్రతిదాడులు దుర్మార్గం

● సీపీఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యుడు మణిలాల్

చెరుకుపల్లి, జూన్ 28 : రాజకీయ కారణాలతో దాడులు, ప్రతిదాడులు దుర్మార్గపు చర్య అని సీపీఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ మణిలాల్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాంబొట్లవారిపాలెం దాడికి గురైన దళిత కుటుంబాన్ని, చెరుకుపల్లిలో ధ్వంసం చేసిన ఇల్లు, బాధిత కుటుంబాలను పరామర్శించామన్నారు. అలాగే నియోజకవర్గంలో రాజకీయ దాడుల వీడియోలు వివిధ సామాజిక మాధ్యమాలలో వచ్చినా నేపథ్యంలో చెరుకుపల్లి మండలం పరిధిలో బాధితులను సీపీఎం పార్టీగా పరామర్శించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం చెరుకుపల్లి మండల కార్యదర్శి కె.శరత్‌బాబు, రేపల్లె నియోజకవర్గ సీపీఎం నాయకులు జీ.డానియేలు, కె.రమేష్‌బాబు, బి.ఆగస్టీన్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు, న్యాయవాది కె.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలి

భట్టిప్రోలు, జూన్ 28 : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని ఎంఈవోలు పులి లాజరు, ఎన్.దేవరాజులు సూచించారు. శుక్రవారం మండలంలోని పెదపులివర్రు పంచాయితీ కోళ్ళపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని వండి వడ్డించాలని వంట గదులను, పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. అదే విధంగా అక్కివారిపాలెంలో గల ప్రాథమిక పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించి హాజరు శాతాన్ని ఎంఈఓలు అడిగి తెలుసుకున్నారు.

రాయితీపై వరి విత్తనాలు పంపిణీ

కొల్లూరు, జూన్ 28 : రాయితీపై రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. శుక్రవారం కొల్లూరులోని రైతు భరోసా కేంద్రాల్లో 25 కేజీల వరి విత్తనాలను రూ.120 రాయితీ ఇచ్చి రూ.930 అందజేశారు. మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్ రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ధూళిపూడి గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానసిక ఒత్తిడిలేని జీవనం అవసరం

బాపట్ల టౌన్, జూన్ 28 : విద్యార్థులకు మానసిక ఒత్తిడి లేని జీవన విధానం అవసరమని న్యూరోసైక్రియాటిస్ట్ డాక్టర్ పి.సందీప్ అన్నారు. బాపట్ల ఫార్మసీ కళాశాలలో శుక్రవారం యాంటీ డ్రగ్స్ డే అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలు వాడటం వల్ల అనేక రుగ్మతలు వస్తాయన్నారు. విద్యార్థులంతా కష్టపడి చదువుకొని ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండాలని, విద్యార్థులంతా క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి, పూర్ణచంద్రరావు, ఉప విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ మేళా

పిట్టలవానిపాలెం, జూన్ 28 : మండల పరిధిలోని ఖాజీపాలెం కేవీఆర్ కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరి మంతెన కృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఇంటర్వ్యూల కార్యక్రమాన్ని మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ మేనేజర్ పుష్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 162 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 82 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

కేశవరెడ్డికి ఎమ్మెల్యే ఘననివాళి

కర్లపాలెం,జూన్ 28 : కర్లపాలెం పంచాయతీ ఎం.వీరాజుపాలెంకు చెందిన ఆట్ల హరిబాబురెడ్డి సోదరుడు ఆట్ల కేశవరెడ్డి శుక్రవారం మృతి చెందారు. కేశవరెడ్డి మృతదేహాన్ని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్కల వెంకటస్వామి, ఏపూరి భూపతిరావు, పిట్ల వసంతరెడ్డి, కట్టా సుజాత, షేక్ బాజి తదితరులు పాల్గొన్నారు.

మోదుకూరు స్కూల్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌కు డాక్టరేట్

గుంటూరు, జూన్ 28 : చుండూరు మండలం మోదుకూరులోని వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా పని చేస్తున్న మాదాసు చంద్రశేఖర్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఏఎన్‌యూ ద్వారా మెటా కాగ్నిషన్, అచీవ్‌మెంట్ మోటివేషన్ ఆఫ్ సెకండరీ స్కూల్ పీపుల్స్ ఇన్ రిలేషన్ టూ అకడమిక్ అచీవ్‌మెంట్ అనే అంశంపై డాక్టర్ జెఆర్ ప్రియదర్శిని మార్గనిర్దేశనంలో పరిశోధన పత్రం అందించటంపై విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ విభాగం చంద్రశేఖర్‌కు డాక్టరేట్ పట్టాను అందజేశారు. వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వెంకటేశ్వర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు డాక్టర్ చంద్రశేఖర్‌కు అభినందనలు తెలిపారు.

పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తాం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు శ్రీవేంకటేశ్వరస్వామి మెమోంటోను అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూన్ 28 : తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయటానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. శుక్రవారం మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లో రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పల్లా శ్రీనివాసరావును ఎమ్మెల్యే నరేంద్రవర్మ మర్యాదపూర్వకంగా కలిసి శ్రీవేంకటేశ్వరస్వామి మెమోంటోను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నాయకత్వంలో గ్రామగ్రామాన పార్టీని ముందుకు తీసుకెళతామన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తను అని గర్వంగా చెప్పుకునే విధంగా తయారు చేస్తామని వివరించారు. గత 5 సంవత్సరాలుగా వైసీపీ పాలనలో ఎందరో కార్యకర్తలు ఇబ్బందులు పడ్డారని కేసులు పెట్టి బాధించారని అయినప్పటికి భయపడక పార్టీకి అండగా నిలిచారని ఈ సందర్భంగా నరేంద్రవర్మ తెలియజేశారు.

వర్సిటీలో అడ్డగోలు నియామకాలు

● అతిథి అధ్యాపకులకు నియామక ఉత్తర్వులు

● ప్రతి పోస్టుకు రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు వసూళ్లు

పెదకాకాని, జూన్ 28: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ తీరు మరోసారి విమర్శలకు లోనవుతోంది. వర్సిటీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకి ఎటువంటి విధి విధానాలు పాటించకుండా హడావుడిగా బుధవారం నియామక ఉత్తర్వులను ఆచార్య పి.రాజశేఖర్ జారీ చేశారు. గడిచిన రెండేళ్లలో ఎటువంటి నిబంధనలు పాటించకుండా, వైసీపీ పెద్దల సిఫార్సులతో పెద్దయెత్తున్న అతిథి అధ్యాపకులుగా నియమించారు. దీంతో పాటు వీసీకి నమ్మినబంట్లుగా పేరున్న కొందరికి అతిథి అధ్యాపకుల ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.5లక్షల నుంచి 7 లక్షల వరకు వసూలు చేసినట్లు వర్సిటీలో జోరుగా ప్రచారం జరుగుతుంది. 2019కి ముందు 45 మంది అతిథి అధ్యాపకులు ఉంటే వీసీ రాజశేఖర్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు దాదాపు 75 మందిని అదనంగా అతిథి అధ్యాపకులుగా నియమించారు. కేవలం తనకు వ్యతిరేకంగా పనిచేశారన్న సాకుతో 2022లో ఐదుగురిని తొలగించారు. దీంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ అనంతరం వీసీ రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలు చెల్లవని కోర్టు కొట్టి వేసింది. దానితో పాటు 17 ఏళ్లగా నిరాటంకంగా వర్సిటీలో సేవలందిస్తున్న అతిథి అధ్యాపకుల్ని విధుల నుంచి తొలగించటం రాజ్యాంగ విరుద్ధమని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పుడు తన పదవికి రాజీనామా చేస్తే తన అనుయాయులకు ఎక్కడ ఇబ్బంది కలుగుతుందో అని హడావిడిగా వారిని 2024-25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకులుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే స్పందించి వీసీ హయాంలో చేపట్టిన నియామ కాలపై విచారణ జరిపి, అక్రమాలను వెలికి తీయాలని వర్సిటీ వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మైనర్‌లకు వాహనాలిచ్చి సమస్యలు తెచ్చుకోవద్దు

● మోటారు వాహనాల తనిఖీ అధికారి ప్రసన్నకుమారి

బాపట్ల, జూన్ 28 : డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా 18 సంవత్సరాలలోపు మైనర్ పిల్లలకు వాహనాలిచ్చి తల్లిదండ్రులు సమస్యలు కొనితెచ్చుకోవద్దు అని మోటారు వాహనాల తనిఖీ అధికారి ప్రసన్నకుమారి తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నందిరాజుతోట గ్రామంలో శుక్రవారం జిల్లా రవాణాశాఖాధికారి సురేష్ ఆదేశాల మేరకు మోటారు వాహనాల తనిఖీ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పిల్లలు నడుపుతున్న వాహనాలను, పరిమితికి మించి ముగ్గురు, ఆపై ఉన్న వాహనాలను ఆపి వారికి అవగాహన కల్పించి అపరాధ రుసుం విధించారు. రాంగ్ డ్రైవింగ్, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే వారిని ఆపి వారి వాహనపత్రాలను పరిశీలించి సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమాన విధించారు. వాహన చోదకులకు ప్రమాదనివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు వాహనానికి సంబంధించిన సరైనపత్రాలు ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటారు వాహనాల తనిఖీ అధికారి కిషోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

బాపట్లరూరల్, జూన్ 28 : మలేరియా వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగియుండాలని జిల్లా మలేరియా అధికారులు విద్యార్థులకు సూచనలు చేశారు. వెదుళ్ళపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని స్టూవర్టుపురం ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల వసతిగృహంలోని విద్యార్థులకు మలేరియా వ్యాధి పై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. వసతిగృహంలోని పలుచోట్ల మలేరియా వ్యాధి నివారణకు మందులను పవర్ స్ప్రే ద్వారా పిచికారి చేయించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి, సబ్ యూనిట్ అధికారులు మహ్మద్ జోసఫ్ షఖీల్, బాపట్ల పట్టణ హెల్త్ సూపర్‌వైజర్ రాంబాబు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన రైల్వేగేటు



భట్టిప్రోలు మొరాయించిన రైల్వే గేటు

భట్టిప్రోలు, జూన్ 28 : మండల కేంద్రం భట్టిప్రోలులో గల రైల్వేగేటు మొరాయించింది. శుక్రవారం సాయంత్రం రేపల్లె నుంచి తెనాలి వైపు రైలు వెళ్ళే సమయంలో గేటు వేయడం జరిగింది. రైలు వెళ్లిన తరువాత గేటు తీసేందుకు గేటు మ్యాన్ ప్రయత్నించగా ఒక్క వైపు మాత్రమే గేటు పైకి లేవడం, రెండవ వైపు గేటు మొరాయించడంతో తీవ్రంగా శ్రమించినప్పటికీ అర్ధగంట పాటు గేటు పైకి లేవలేదు. దీంతో పాఠశాల బస్సులు, ఆటోలు, వాహనాలు నిలిచిపోవడంతో వాహనచోదకులు, విద్యార్థులు పలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కాలంలో తరచుగా రైల్వే గేటు మొరాయిస్తుందని వాహన చోదకులు తెలియజేశారు. రైల్వే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

40,445 మంది పెన్షన్‌దారులకు రూ.27.14కోట్లు

వేమూరు, జూన్ 28 : రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల పెన్షన్‌దారులకు పెంపుదల చేసిన పెన్షన్ల ఆధారంగా జులై 1న వేమూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 40,445 మందికి రూ.27 కోట్ల 14 లక్షల 74 వేలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవోలు తెలిపారు. సచివాలయానికి చెందిన ఉద్యోగులు ఒక్కొక్కరికి 50 మంది లబ్ధిదారుల జాబితాలను అప్పగించామన్నారు. 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. అదే రోజున పంపిణీ పూర్తి అవుతుందని, ఒకవేళ పూర్తి కాని పక్షంలో 2న కూడా ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటికి వెళ్ళి పెన్షన్ అందించడం జరుగుతుందన్నారు.

గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

రేపల్లె, జూన్ 28 : గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా అతిసార కేసులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా ఆయా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. అతిసార కేసులపై ప్రజల్లో అవగాహన కోసం ఇంటింటికి ప్రచారం నిర్వహించాలని, ఐదు సంవత్సరాల లోపు గల పిల్లలకు ఓఆర్ఎస్ఎస్ ప్యాకెట్లు, జింకు అందజేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, సీడీపీవో మాణిక్యం, ఎంఈవో రత్నశేఖర్ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మహిళామార్ట్ కమిటీ సభ్యులు, మెప్మా సీఎంఎంతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

మహిళామార్ట్ లెక్కలు తేలాల్సిందే..!

● సీఎంఎంపై కమిషనర్ ఆగ్రహం

అద్దంకి, జూన్28: మహిళా మార్ట్ లెక్కలు అన్నీ తేలాల్సిందేనని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. మెప్మా సభ్యుల నుంచి సేకరించిన సుమారు 11 లక్షల రూపాయలతో రెండున్నర సంవత్సరాల క్రితం మహిళామార్ట్ ఏర్పాటు చేసి నిర్వహిస్తుండగా ఇంతవరకు లెక్కలు చెప్పకపోవటంతో సభ్యులు, ఆర్‌పీలు సీఎంఎంను ప్రశ్నించటంతో పాటు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆర్‌పీలను, మార్ట్ నిర్వహణ కమిటీ సభ్యులను పిలిపించారు. మార్ట్ నిర్వహణ కమిటీలో 12 మంది సభ్యులు ఉండగా ఆరుగురు మాత్రమే హాజరు అయ్యారు. ఈ సందర్భంగా కమిటీ ఏర్పాటు బైలా, జమా ఖర్చుల వివరాలు గురించి సీఎంఎం ఫణికుమారిని కమిషనర్ ప్రశ్నించారు. పూర్తి స్థాయి సమాచారం లేకపోవటం, కమిటీ సభ్యులు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసి గురువారం మరో సారి అందరితో సమావేశం నిర్వహిస్తామని, అందరు ఖచ్చితంగా హాజరయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. తనకు అనుకూలంగా ఉండే కమిటీ సభ్యులను సమావేశానికి హాజరుకాకుండా సీఎంఎం వ్యవహరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జమా,ఖర్చులు నిర్వహించే కమిటీ సభ్యులే హాజరుకాకపోవటంలోని ఆంతర్యం ఏమిటని పలువురు ఆర్‌పీలు ప్రశ్నిస్తున్నారు. బ్యాంక్ ఖాతాలో 70 వేల రూపాయల నగదు మాత్రమే ఉందని, మార్ట్‌లో సరుకుల విలువ కూడా అతి తక్కువగానే ఉందని, ఈ తరుణంలో సుమారు 10 లక్షల రూపాయలు ఏ మయ్యాయని మెప్మా సభ్యులు, ఆర్‌పీలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాలన్నీ విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకుపోనున్నట్లు తెలిపారు.



బూదవాడలో మలేరియాపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు

నీటి శుభ్రత, దోమల నిర్మూలనతో వ్యాధులు దూరం

పంగులూరు, జూన్ 28 :పరిశుభ్రమైన నీటి వినియోగంతో పాటు దోమల నిర్మూలనతో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, బోదకాలు వంటి వ్యాధులు దరిచేరవని ఆరోగ్య పర్యవేక్షకులు మదర్‌సా అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా శుక్రవారం బూదవాడలో ఆరోగ్య సిబ్బంది స్థానిక పాఠశాల విద్యార్థులతో అవగాహనా ర్యాలీని హెచ్.యం. బంగారుకొండ ఆధ్వర్యంలో నిర్వహించారు. నీరు నిల్వ లేకుండా చూడాలని, పరిసరాల పరిశుభ్రత పాటించడం, నీటితొట్లను బ్లీచింగ్‌తో శుభ్రపరచి ఎండబెట్టడం, దోమతెరల వాడకం, దోమల నిర్మూలన చర్యలు చేపట్టడం చేయాలని సూచించారు. ఖాళీ కొబ్బరి బొండాలు, రోలు, తొట్లు, కూలర్లు, వాడిపడేసిన డబ్బాలలో నీరు నిల్వకుండా చూడాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో. స్వప్నలత, ఆశాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీరంలో భద్రతా చర్యలకు శ్రీకారం

చీరాల, జూన్ 28 : తీరప్రాంతంలో భద్రతా చర్యలకు రిసార్టుల నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. ఇటీవల జరిగిన వరుస ప్రమాదాలు, మృత్యుసంఘటనల నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య ఆ ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించారు. భవిష్యత్‌లో అలాంటి సంఘటన ఒక్కటి కూడా జరగకుండా ఉండేందుకు రిసార్టుల నిరాహకులు, పోలీస్ అధికారులతో ఒకటికి రెండు పర్యాయాలు సమీక్షలు నిర్వహించారు. అధికారులతో తీరప్రాంతంలో ప్రత్యేకంగా పరిశీలనలు చేశారు. పలు సూచనలు చేశారు. అందులో భాగంగా రిసార్టుల నిర్వాహకులు భద్రతా చర్యలకు శ్రీకారం చుట్టారు. ముందస్తుగా ఐదు ప్రదేశాల్లో బీచ్ ఏరియాలుగా అభివృద్ధి పరచనున్నారు. పర్యాటకులు ఎవరైనా ఆ ఐదు ప్రాంతాల్లోనే స్నానాలు చేయాలి. ప్రత్యేకంగా నిర్దీత పార్కింగ్ ఏరియాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. వాహనాలు అక్కడే నిలపాలి. ప్రమాదాల నివారణకు, ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకు గజ ఈతగాళ్లను సిద్ధం చేస్తున్నారు. అనౌన్స్‌మెంట్ క్యాబిన్లు(వాచ్ టవర్స్) ఏర్పాటు చేస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా ఎర్రజెండాలతో హెచ్చరిక పోల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

టిడ్కో ఇళ్లకు మహర్దశ

అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు చర్యలు

త్వరలో లబ్ధిదారులకు అందించే అవకాశం

ప్రథమ ప్రాధాన్యంగా తీసుకున్న టీడీపీ కూటమి ప్రభుత్వం



అద్దంకి పట్టణంలోని శింగర కొండ సమీపంలో నిర్మాణ దశలో ఆగిపోయి ఉన్న టిడ్కో ఇళ్లు

అద్దంకి, జూన్ 28: టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల ముఖాలలో ఆనందం వెల్లువిరుస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చేందుకు టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో అద్దంకి పట్టణంలోని శింగరకొండ సమీపంలో సుమారు 960 మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు మంజూరు అయ్యాయి. అందులో 97 గృహాలు రద్దు అయ్యాయి. దీంతో 863 ఇళ్ల నిర్మాణం అత్యధిక శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన కొద్ది పాటి పనులు పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయటంపై వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. దీంతో 5 సంవత్సరాలు టిడ్కో ఇళ్ల అసంపూర్తి పనులు అడుగు ముందుకు పడలేదు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో టిడ్కో ఇళ్ల అసంపూర్తి పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసే పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే అద్దంకి పట్టణంలోని టిడ్కో ఇళ్ల వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కు అధికారులు స్థల పరిశీలన కూడా చేశారు. ఇక మిగిలి పోయిన పనులు కూడా వేగవంతంగా పూర్తి చేసే అవకాశం ఉంది. దీంతో మరో ఐదారు నెలలలో అన్ని పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేసే అవకాశం ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రీ టెండర్ పేరుతో అద్దంకి పట్టణ సమగ్ర మంచినీటి పథకాన్ని మార్పు చేశారు. దీంతో తమ్మవరం సమీపంలోని గుండ్లకమ్మ నది వద్ద నుంచి శింగరకొండ సమీపంలోని టిడ్కో ఇళ్ల వద్దకు వేయాల్సిన మెయిన్ పైప్‌లైన్, ఓవర్ హెడ్ ట్యాంక్ కాస్తా రద్దు చేసి అద్దంకి పట్టణం వరకే పరిమితం చేశారు. టిడ్కో ఇళ్ల అసంపూర్తి పనులు చేపట్టే క్రమంలో మంచినీటి పథకాన్ని పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అమరావతి రైతుల పాదయాత్రకు ఘనస్వాగతం



ఇంకొల్లులో పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

● ఐదో రోజు ఇంకొల్లుకు చేరిక

ఇంకొల్లు,జూన్ 28: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి నారాచంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి గౌరవసభలో అడుగిడిన శుభసందర్భంగా అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించడంతో అమరావతి రైతులు మొక్కులు తీర్చుకునేందుకు వెంకటపాలెం నుంచి తిరుపతి వరకు పాదయాత్ర చేపట్టారు. ఆ పాదయాత్ర 24 వతేదీన వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి 30 మంది రైతులు ప్రారంభించగా ఐదో రోజు శుక్రవారం ఇంకొల్లు చేరుకుంది. మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళలు వారికి ఘనస్వాగతం పలికారు. ఇంకొల్లులో రాత్రికి ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో బస చేసే విధంగా వారికి మండల పార్టీ అధ్యక్షులు నాయుడు హనువంత రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. శనివారం పాదయాత్ర ఇంకొల్లు నుంచి ప్రారంభమై కొణికి, దుద్దుకూరు, రాచపూడి, నాగులుప్పలపాడుకు చేరుకుంటుందని తెలిపారు. ఈ పాదయాత్రలో అమరావతి రైతులు సురేష్, జయకృష్ణ, కృష్ణారావు, అనుపమ, అనిత, ప్రసన్న, చెన్నకేశవరావు, శివకుమారి, రేణుక, సంధ్య, రత్నకుమారి, గీత, శివలీల పాదయాత్రలో పాల్గొనగా స్థానిక టీడీపీ నాయకులు నాయుడు హనుమంతరావు, మార్కు, కరిశ్రీను, సాంబయ్య రఫీ, సంధ్యారాణి, అనంతలక్ష్మి, సుబ్బాయమ్మ, శివయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైతులకు స్వాగతం పలికిన దగ్గుబాడు వాసులు

దగ్గుబాడు(పర్చూరు) : రైతులు చేపట్టిన కృతజ్ఞతా పాదయాత్ర శుక్రవారం కారంచేడు మండలం దగ్గుబాడుకు చేరుకుంది. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాశీం నేతృత్వంలో ఆపార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మేము సైతం అమరావతి రైతులకు మద్దతు అంటూ నినాదాలు చేశారు.



అమరావతి రైతుల పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న టీడీపీ శ్రేణులు

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం

తాగునీటి ఎద్దడి ఉన్నా ప్రస్తావించని కౌన్సిలర్‌లు



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

అద్దంకి, జూన్28: అద్దంకి మున్సిపల్ సమావేశం శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగింది. మున్సిపల్ సమావేశం ప్రారంభమైన 15 నిమిషాలకే ముగిసింది. అజెండాలో ఉన్న మూడు అంశాలను చదవగా చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ ఆమోదిస్తున్నట్లు ప్రకటించటంతో సమావేశం ముగిసింది. అద్దంకి పట్టణంలో ప్రస్తుతం తాగునీటి సమస్య తీవ్రతరం అయ్యింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రోజు విడిచి రోజు నీటి సరఫరా జరుగుతోంది. అందులో కూడా గతంతో పోల్చుకుంటే అతి తక్కువ పరిమాణంలో మాత్రమే నీటి విడుదల జరుగుతోంది. సమగ్ర మంచినీటి పథకం పూర్తి కాకపోవటం, గుండ్లకమ్మ నదిలో ఊటబావులలో నీటి లభ్యత తక్కువగా ఉండటంతో నీటి సమస్య ఉత్పన్నమైంది. గతంలో మరి కొన్ని తాత్కాలిక ఊటబావులను తవ్వి నీటిని పంపింగ్ చేశారు. అయితే ప్రస్తుతం అటు వైపు అంతగా దృష్టి పెట్టకపోవటం సమస్య జటిలం అయ్యింది. అయినప్పటికి కౌన్సిలర్‌లు సమావేశంలో ప్రస్తావించకపోవటం విమర్శలకు తావిస్తోంది. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన తొలి మున్సిపల్ సమావేశం కావటంతో సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యుత్ శాఖా మంత్రి, అద్దంకి ఎమ్మెల్యే అయిన గొట్టిపాటి రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఎన్నికల ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 13 వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి ప్రతిపాదించిన ప్పటికి చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ ఎలాంటి స్పందన వ్యక్తం చేయకపోగా, ఆమోదించకపోవటం పట్ల టీడీపీ కౌన్సిలర్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం నుంచి చైర్‌పర్సన్, వైసీపీ కౌన్సిలర్‌లు అర్ధంతరంగా వెళ్లిపోవటం ఏమిటని ప్రశ్నించారు. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వానికి, స్థానిక శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్‌కు మంత్రి పదవి రావటం పట్ల హర్షం వ్యక్తం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్న విషయాన్ని టీడీపీ కౌన్సిలర్‌లు వ్యక్తం చేశారు.



టీడీపీ కూటమి అధికారం చేపట్టిన సందర్భంగా స్వీట్లు తినిపించుకుంటున్న టీడీపీ కౌన్సిలర్లు

స్వీట్లు పంచిన టీడీపీ కౌన్సిలర్‌లు

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత శుక్రవారం జరిగిన తొలి మున్సిపల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్‌లు స్వీట్లు పంచారు. చైర్‌పర్సన్, వైసీపీ కౌన్సిలర్‌లు అప్పటికే వెళ్లి పోవటంతో టీడీపీ కౌన్సిలర్‌లతో పాటు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మరో ఇద్దరు కౌన్సిలర్‌లు స్వీట్లు తినిపించుకున్నారు. మూడేళ్ళ మున్సిపల్ పాలనకు భిన్నంగా అభివృద్ధే అభిమతంగా టీడీపీ పాలనలో అద్దంకి పట్టణం మరింత అభివృద్ధి చేసేందుకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సిద్ధంగా ఉన్నారని టీడీపీ కౌన్సిలర్‌లు అన్నారు. కౌన్సిలర్‌లు మాగులూరి తిరుపతమ్మ, కంపా రజనీ, మొండితోక సీతమ్మ, రంగిశెట్టి సుభాషిణి, అత్తులూరి రమేష్, విజయలక్ష్మి, జహీరా, తేజశ్వని, యేజెండ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

యద్దనపూడి, (మార్టూరు) జూన్ 28: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని,ఉన్నత చదువులు చదవాలనే ఆకాంక్షతో విద్యను అభ్యసించాలని చీరాల డీవైఈవో నిర్మలాదేవి అన్నారు. శుక్రవారం ఆమె యద్దనపూడి జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ లోని వసతులను పరిశీలించారు. విద్యార్థులకు సంబంధించిన సైన్సు ల్యాబ్‌ను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

ఇంకొల్లు ,జూన్ 28: పండ్ల తోటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వంరాయితీ కల్పిస్తుందని పర్చూరు ఉద్యానశాఖ అధికారి రవిప్రకాశ్ తెలిపారు. ఇంకొల్లులో ఆయన సంబంధిత అధికారులతో సమావేశమైయ్యారు. ఉద్యానపంటలైన మామిడి, బత్తాయి, నిమ్మ, జామ,సీతాఫలం, నేరేడు, డ్రాగాన్‌ఫ్రూట్స్ తోటల సాగుకు అధికంగా రాయితీ ఉందన్నారు. ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులు ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసువాలని కోరారు.

ముప్పవరంలో పట్టపగలు దొంగలు హల్‌చల్

● రెండు ఇళ్లలో నగదు, ఉంగరాల చోరీ



పగులకొట్టిన బీరువాను చూపుతున్న నాగేంద్రం

పంగులూరు, జూన్ 28 :మండలంలోని ముప్పవరం గ్రామంలో పట్టపగలు దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామంలోని రెండు నివాస గృహాలలో చోరీకి పాల్పడిన దొంగలు నగదు, బంగారు ఉంగరాలు అపహరించుకుపోయారు. ముందుగా గ్రామంలోని దొడ్డా నాగేంద్రం ఇంటిలోకి ప్రవేశించిన దొంగలు ఆమె ఇంటిని దోచుకున్నారు.స్థానికంగా ఉన్న పొగాకు కంపెనీలో రోజువారి కూలీగా నాగేంద్రం పనిచేస్తుంది. శుక్రవారం ఉదయం 9 గంటలకు పనికి వెళ్లిన నాగేంద్రం ఒంటిగంట సమయంలో ఇంటికి వచ్చింది. ఆ సమయానికి ఇంట్లోని సామానంతా చిందరవందరగా పడిఉండటంతో పాటు బీరువా పగులగొట్టి ఉండటం చూసి ఆందోళనకు గురయింది. ఇంటి వెనుకవైపు నుంచి తలుపు గడియ తీసుకుని లోనికి ప్రవేశించిన దొంగలు ఇంటిలోని బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.45 వేల నగదుతో పాటు రెండు ఉంగరాలను దోచుకున్నట్లు నాగేంద్రం తెలిపింది. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ఇదే గ్రామంలోని జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న తిరుమలశెట్టి వినోద్‌కుమార్ ఇంట్లో కూడా దొంగలు ప్రవేశించి 17వేల రూపాయల నగదు దోచుకున్నారు. వినోద్‌కుమార్ చోరీ సమాచారాన్ని పోలీసులకు తెలియపరిచినట్లు తెలిపారు. గ్రామంలో వేరు వేరు ప్రాంతాలలో నివాసం ఉంటున్న రెండు గృహాలలో శుక్రవారం పట్ట పగలు చోరీ జరిగిన ఘటనతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు.

విద్యుదాఘాతంతో గ్రానైట్ కార్మికుడు మృతి



మృతిచెందిన కార్మికుడు రాజేష్

బల్లికురవ, జూన్ 28 : మండల పరిధిలోని వేమవరం- ఉప్పుమాగులూరు గ్రామాల మధ్య ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీలలో పనిచేసే ఒడిసాకు చెందిన కార్మికుడు తంతి రాజేష్ (26) శుక్రవారం విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు.. గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుడు రాజేష్ తనకు ఏర్పాటు చేసిన రేకుల షెడ్‌లో ఉండగా శుక్రవారం ఉదయం నిద్ర లేవగానే రేకుల షెడ్ పై విద్యుత్ వైరు ఉండటాన్ని చూడక ప్రమాదవశాత్తు దానిని కార్మికుడు పట్టుకోగానే విద్యుత్ షాక్ తగిలి నేలపై పడిపోయాడు. వెంటనే తోటి కార్మికులు చిలకలూరిపేట వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగానే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి పరిశీలించారు. స్టేషన్ రైటర్ అంజనేయులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ముగిసిన పోలేరమ్మ కొలుపులు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

బల్లికురవ. జూన్ 28 : మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న పోలేరమ్మ తల్లి కొలుపులు శుక్రవారంతో ముగిశాయి. భక్తి శ్రద్ధలతో గ్రామస్థులు అయిదు దశాబ్దాల తదుపరి నిర్వహించిన కొలుపులు గ్రామంలో పండగ వాతావరణాన్ని నెలకొల్పాయి. పురాతన కాలంలో ఉన్న అచారాలను కథల రూపంలో ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా పోలేరమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించారు. సుమారు 10 వేల మందికి అన్నదానం చేశారు.

ర్యాంకులు సాధించిన అద్దంకి విద్యార్థులు

అద్దంకి, జూన్22: రాష్ట్ర స్థాయి ఎంట్రెన్స్ టెస్ట్ లలో అద్దంకి కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఏపీ పీజీ సెట్‌లో బీఏ విద్యార్థి బి. అక్షయబాబుకు హిస్టరీలో రెండో ర్యాంకు, బీఎడ్‌లో 52 వ ర్యాంకు, బీఎస్సీ విద్యార్థి షేక్ ఇస్మాయిల్‌కు జువాలజీలో 22 వ ర్యాంక్, పొన్నూరి వీరాంజనేయులుకు 174 వ ర్యాంక్, కొమర దుర్గాప్రసాద్‌కు 218 వ ర్యాంక్,ఇంగ్లీషులో పి.దిలీప్ 302 వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ మోహనరావు, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మోహనరావు, అధ్యాపకులు

డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ

ఇంకొల్లు,జూన్ 28: ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన పథకంలో భాగంగా ఇంకొల్లు మారుతీ ఐటీఐ కాలేజిలో వ్యవసాయ డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణా కార్యక్రమం శుక్రవారం ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ కారుమూడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కోర్సుకు 45 మంది హాజరుకాగా ఆగస్టు 6వ తేది వరకు కొనసాగుతోందన్నారు.శిక్షణా కాలంలో డ్రోన్‌ట్రైనింగుతో పాటు కంప్యూటర్‌పై అవగాహన కలిపిస్తామన్నారు. ఆగస్టు రెండవ వారంలో తదుపరి బ్యాచ్ ప్రారంభమౌతుందని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

చీరాల, జూన్ 28 : మున్సిపల్ పరిధిలో ప్రజలకు అధికారులు, సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి చెప్పారు. తనచాంబర్‌లో శుక్రవారం శానిటేషన్, విద్యుత్, పార్కుల నిర్వహణ అధికారులు, సిబ్బందితో వేరు,వేరుగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఆవులను పోషకులు తమ ఇళ్ల వద్దనే కట్టేసుకోవాలని చెప్పారు. లేదంటే నోటీసులు ఇవ్వాలన్నారు. పార్కుల నిర్వహణ సక్రమంగా ఉండాలని, డివైడర్లలో ఏపుగా పెరిగే చెట్లను ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. విద్యుత్ స్తంభాలకు ఉన్న దీపాలు అన్నీ రాత్రి వేళ్లలో పూర్తిస్థాయిలో వెలిగే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. సమావేశంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.